ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 24 డిసెంబరు 2024



అంతర్గాం స్పిన్నింగ్ భూములు అన్యాక్రాంతం

- ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేసిన కాందిశీకులు
- టెక్స్‌టైల్స్, రెవెన్యూ అధికారులు సీరియస్
- జాయింట్ సర్వేకు ఆదేశం

7



జాయింట్ సర్వే చేస్తున్న రెవెన్యూ, టెక్స్‌టైల్స్ అధికారులు

న్యూస్ బాక్స్

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డీపీవోకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండీ ఖాజా మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. 27, 28 తేదీల్లో రెండురోజుల పాటు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

రైస్ మిల్లుల్లో మహిళా కార్మికుల వేతనాలు పెంచాలి

సుల్తానాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రాంతంలోని రైస్ మిల్లుల్లో పనిచేసే మహిళా కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులకు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం మహిళా కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముత్యంరావు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, గుమస్తాల సంఘం అధ్యక్షుడు మాతంగి రాజమల్లు, మహిళా కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు.

31న మల్లన్న క్షేత్రంలో వేలం


ఓదెల డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఈనెల 31న జాతరలో పలు విక్రయాల హక్కు కోసం వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహన అధికారి సదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కిరాణం, పూజ సామగ్రి అమ్ముకునేందుకు హక్కు కోసం ముందుగా రూ. 3.50 లక్షలు ధరావత్తు సొమ్మును చెల్లించాలని కోరారు. అలాగే వంటచెరుకు రూ. మూడు లక్షలు, శీతల పానీయాల విక్రయం కోసం రూ. లక్ష, పూల దండలు, పూలు విక్రయం కోసం రూ. రెండు లక్షలు, టెంకాయ ముక్కలు పోగుచేసుకొనే హక్కు కోసం రూ. లక్ష, తల్లి ఆరాధన రూ. 30 వేలు ధరావత్తు చెల్లించాలని కోరారు. వీటి కాలపరిమితి 2025 మార్చి 3 నుంచి 2026 మార్చి రెండు వరకు ఉంటుందని తెలిపారు. అలాగే తలనీలాల విక్రయం హక్కు కోసం రూ. 80 వేలు ధరావత్తు చెల్లించాలని, 2025 జనవరి ఒకటి నుంచి 2026 జనవరి 31వరకు దీని కాలపరిమితి ఉంటుందని తెలిపారు. టెండర్ దరఖాస్తులు ఆలయంలో ఈనెల 31 వరకు ఉదయం 10 గంటలకు దరఖాస్తులను అందజేయాలని, రూ. ఐదు వందలు చెల్లించి సంబంధిత టెండర్ దరఖాస్తులు తీసుకోవాలని ఈవో సదయ్య సూచించారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంథని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర కరాటే పోటీలకు మంథని జేకేఏ షోటోకాన్ కరాటే క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ కోండ్ర నాగరాజు సోమవారం తెలిపారు. పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు సీనియర్, జూనియర్, క్యాడెట్ విభాగంలో ప్రతిభ కనబరిచారు. జనవరి 1,2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కరాటే సెలక్షన్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. జేకేఏ సౌత్‌జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య అభినందించారు.

సాగు భూములకే రైతు భరోసా

- పీఎం కిసాన్ సమ్మాన్ నిబంధనలు అమలు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఐటీ హోల్డర్లకు లేదు
- పంటలు సాగయ్యే భూములకే పెట్టుబడి సాయం
- 10 లేదా 15 ఎకరాలకు సీలింగ్ పెట్టే యోచన



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రైతు భరోసా పథకంపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. సాగులో ఉన్న భూములకే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిబంధనలను అనుసరించి పథకాన్ని అమలు చేస్తామని చెప్పింది. ఎన్ని ఎకరాల వరకు సీలింగ్ విధిస్తారనే విషయం తేలాల్సి ఉంది. సంక్రాంతి తర్వాత నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా పథకం అమలు చేసే విషయమై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చర్చకు పెట్టారు. ఈ అంశంపై విపక్షాలతో పాటు మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. అంతకుముందు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని వేశారు.

ఈ సంఘం ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాల, ఆయా వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఆ మేరకు మంత్రి వర్గ ఉపసంఘం నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి ఇచ్చింది. అసెంబ్లీలో కూడా చర్చించిన తర్వాత స్వపక్ష, విపక్ష సభ్యుల అభిప్రాయాలు సేకరించిన తర్వాత విధివిధానాలను రూపొందించి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు శనివారం రైతుభరోసా పథకం అంశాన్ని చర్చకు పెట్టింది. పలువురు తమ అభి ప్రాయాలను వ్యక్తం చేయగా, ప్రభుత్వం తరపున సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాత్రం సాగవుతున్న భూములు కలిగిన రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ పథకం నిబంధనలను అనుసరించి అమలు చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో పట్టా భూమి కలిగిన వారందరికీ రైతుబంధు పథకాన్ని వర్తింప జేశారు.

మిగతా 8వ పేజీలో

ఎల్లంపల్లి భూముల కబ్జాపై కలెక్టర్ సీరియస్

- పరిశీలన కోసం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గోదావరిఖని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు భూములను కబ్జా చేసి అక్రమంగా 200 ఎకరాల్లో చేపల చెరువు ఏర్పాటుపై కలెక్టర్ కోయ శ్రీహర్ష సీరియస్ అయ్యారు. 'ఎల్లంపల్లి భూములు కబ్జా' అనే శీర్షికన మూడు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ విషయంలో పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకోవాలని నివేదిక సమర్పించాలని శ్రీపాద ఎల్లంపల్లి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, నీటిపారుదల అధికారులు అక్రమంగా ఎల్లంపల్లి భూముల్లో నిర్మించిన చేపల చెరువులను కూల్చివేయాలని ఆదేశించినట్టు సమాచారం. అయితే కోట్ల రూపాయలు గడిస్తున్న భూముల కబ్జా ఆక్రమణదారుల మాఫియా ఇటు ఇరిగేషన్ అధికారులపై, జిల్లా యంత్రాంగంపై ప్రభుత్వంలోని పెద్దలతో ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అంతర్గాం మండలం పొట్యాల నుంచి ముర్మూర్ వరకు సోమనపల్లి, ఆకెనపల్లి, ముర్మూర్ శివారుల్లో శ్రీపాద ప్రాజెక్టు భూముల్లో ఈ దందా కొనసాగిస్తుండడంతో ఆ ప్రాంతలోని అన్నివర్గాలపై సంబంధాలు కలిగి ఉన్న ఈ మాఫియా తమ కబ్జాలను కొనసాగించే విధంగా పైరవీలకు తెరలేపినట్టు సమాచారం. ప్రభుత్వ యంత్రాంగం కూడా శ్రీపాద ప్రాజెక్టు భూముల దురాక్రమణను నిరోధించేందుకు చర్యలకు పూనుకున్నది.

దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి కార్మికులు

- సింగరేణికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- ఘనంగా ఆవిర్భావ వేడుకలు



ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్





బెలూన్స్ వదులుతున్న ఆర్జీ-1జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, అధికారులు, కార్మిక నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందిస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సింగరేణి 136 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను స్థానికంగా ఖర్చు చేయించకుండా వేరే ప్రాంతాల్లో ఖర్చు చేశారని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికులకు రక్షిత నీటిని అందించడంలో ఇబ్బందులు తలెత్తితే తాను సీఎండీ బలరాంనాయక్‌తో మాట్లాడి సింగరేణి కార్మికులకు రక్షిత మంచినీటిని అందించాలని, గ్రావిటీ ఫిల్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. సింగరేణి లాభాల వాటాలో కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరగా వెంటనే స్పందించి కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా ఇచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, సేవా సమితి అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, కాంగ్రెస్ నాయకురాలు మనాలీ ఠాకూర్, 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కె స్వామి, మడ్డి ఎల్లయ్య, సింగరేణి కో ఆర్డినేటర్ బంగారు సారంగపాణి పాల్గొన్నారు.

● ఆర్జీ-1లో..

గోదావరిఖని: ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితోనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించి సంస్థ మనుగడ కోసం కృషి చేస్తున్నారని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. సోమవారం సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా జీఎం కార్యాలయంలో జెండావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. మారుతున్న బొగ్గు అవసరాల నేపథ్యంలో ఉత్పాదకత పెంచి ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నా రు. అనంతరం బైక్ ర్యాలీగా వేడుకల వేదిక సింగరేణి స్టేడియానికి చేరుకున్నారు. సింగరేణి స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనితలలిత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు, డీజీఎం(ఫైనాన్స్) ధనలక్ష్మీబాయ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు బంగారు సారంగపాణి, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, ఏఐటీయూసీ నాయకులు స్వామి, ఆరెల్లి పోషం, మడ్డి ఎల్లయ్య, సీఎంవోఏ నాయకులు పొనగోటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్జీ-3లో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జీఎంలు

● ఆర్జీ-2లో...

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో జీఎం బండి వెంకటయ్య, డివిజన్ పరిధిలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులు సింగరేణి పతాకాలను ఆవిష్కరించారు. అబ్దుల్ కలాం క్రీడామైదానంలో జీఎం స్టాల్స్‌ని ప్రారంభించారు. సాయంత్రం జరిగిన ప్రధాన ఉత్సవంలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్ళు ఆకట్టుకోగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జీఎం వెంకటయ్య మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు సిరుల సింగరేణిని అందించే బాధ్యత నేటి ఉద్యోగులపై ఉందన్నారు. కార్యక్రమాల్లో రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఏరియా సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ శ్యాంసన్, పీవో మధుసూదన్, ఎస్వోటూ జీఎం రాముడు పాల్గొన్నారు.

● ఆర్జీ-3లో..

రామగిరి: సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఉదయం ఆడ్రియాల ప్రాజెక్టు ఏరియా ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జీఎం కార్యాలయం ఆవరణలో ఏపీఏ జెండాను ఆవిష్కరించగా ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సెంటినరీకాలనీలోని రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం డివిజన్లలోని వివిధ యంత్రాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఏరియాలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన అధికారులను, ఉద్యోగులను, సేవా సభ్యులను ఘనంగా సత్కరించారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. వేడుకల్లో అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, సేవ అధ్యక్షురాలు అలివేణి, విజయలక్ష్మివెంకటేశ్వర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వైవీ రావు, ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దేహదానానికి ఆర్జీ-1 జీఎం అంగీకారం



అంగీకార పత్రాన్ని రాస్తున్న లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన సదాశయ ఫౌండేషన్ స్టాల్‌ను జీఎం సందర్శించారు. నేత్ర, అవయవ, శరీర దానంపై సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు చేస్తున్న కృషిని జీఎం అభినందించారు. ఈ సంర్భంగా అప్పటికప్పుడే స్పందించిన జీఎం తన మరణానంతరం నేత్ర, అవయవ, దేహదానం చేస్తానని అంగీకార పత్రాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం కిరణ్ బాబు, సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి





గోదావరిఖనిలో పూలమాల వేస్తున్న మేయర్ అనిల్‌కుమార్, మంథనిలో మాట్లాడుతున్న పుట్ట మధు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ మహంకాళి స్వామి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దపల్లి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజవాణిలో అడిషనల్ కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు అమిత్‌షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, ఎండీ ముస్తాఫా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● అమిత్‌షా వ్యాఖ్యలు విచారకరం..

మంథని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు విచారకరమని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. అమిత్‌షా అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో స్థానిక ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పుట్ట మధు, బీఆర్ఎస్ నేతలు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, ఎక్కేటి అనంతరెడ్డి, నూనె కుమార్ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

[illegible]

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు శిక్ష

కరీంనగర్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నదనే కారణంగా భార్యను హత్య చేసిన కేసులో నిందితుడు షేక్ రఫీక్(35)కు జీవితఖైదు శిక్ష, జరిమానాను విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి ప్రతిమ సోమవారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కరీంనగర్‌లోని హుస్సేనిపుర ప్రాంతానికి చెందిన షేక్ రఫీక్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోగా కుటుంబంలో గొడవలు అయి పెద్ద మనుషుల పంచాయితీ జరిగింది. అయినప్పటికీ రఫీక్‌లో మార్పు రాలేదు. 2020 ఏప్రిల్ 24న ఇదే విషయంపై రఫీక్‌ను ఆయన భార్య నిలదీయగా ఆగ్రహంతో ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. మృతురాలి తండ్రి కరీంనగర్ మూడో ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో నిందితుడికి జీవితఖైదుతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బి ప్రతిమ తీర్పు వెలువరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వీణవంక,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఈ నెల 13న ప్రమాదానికి గురి కాగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మత్తమారి ఓదెలు(73) గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద నీటి పైపులను అతికించేందుకు చిన్న మంట పెట్టి అతికిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎండుగడ్డికి అంటుకున్న క్రమంలో ఓదెలు కాలు జారీ మంటల్లో పడగా శరీరం కాలిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మత్తమారి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తంగళ్ళపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) గంజాయి తాగుతూ, అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండలంలోని తాడూర్ గ్రామ శివారులో సోమవారం ఎల్లమ్మ గుడి వద్ద, తంగళ్లపల్లి గ్రామానికి చెందిన కుంటి అభిలాష్, టెక్స్టైల్ పార్క్‌కి చెందిన కనుకుంట్ల మహేష్ అలియాస్ మప్పిలు గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తూ పట్టుబడగ, వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య


వరుణ్‌ప్రియ (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద పాపయ్యపల్లిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వరుణ్‌ప్రియ (18) హన్మకొండలో డిగ్రీ చదువుతుంది. ఈ క్రమంలో తన అమ్మమ్మ ఊరైనా పెద్దపాపయ్యపల్లి గ్రామానికి వచ్చింది. ఇంట్లో వారు పొలం పనులకు వెళ్లగా ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అదే గ్రామానికి చెందిన గుంపుల అజయ్ అనే యువకుడు వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తక్కువ విస్తీర్ణం.. ఎక్కువ పంటలు


గాండ్ల మహేందర్ సాగు చేసిన పంటలు

మూడు ఎకరాల్లో 8 రకాలకు పైగా కూరగాయల సాగు

స్వయంగా మార్కెట్‌లో విక్రయం

వీణవంక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు సాగు చేయాలనే ఆలోచనతో తనకు భూమి లేకున్నా మూడు ఎకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. అందరి కంటే భిన్నంగా ఆలోచించి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంట సాగు చేయాలని అనుకున్నాడు. మరో వైపు పంటకు మొత్తం డ్రిప్ ఏర్పాటు చేసి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు పండిస్తున్నాడు. వీణవంక మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన గాండ్ల మహేందర్ అనే రైతు మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేస్తూ నష్టం రాకుండా చూసుకుంటున్నాడు.

మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా విస్తీర్ణం పెంపు

గాండ్ల మహేందర్ తను తీసుకున్న మూడు రకాల కౌలు భూమిలో టమాట, మిర్చి, కాకరకాయ, బీరకాయ, అలసంద, క్యాబేజీ, దోస, బెండ, చిక్కుడుకాయ, వంకాయ లాంటి పంటలను సాగు చేస్తున్నాడు. మార్కెట్లో ఏ కూరగాయాలకు డిమాండ్ ఉందో తెలుసుకున్న తరువాత ఆ పంట విస్తీర్ణం పెంచుతున్నాడు. పంట వ్యవధి మూడు నెలలు కావడంతో సంవత్సరానికి దాదాపు నాలుగు సార్లు పంట చేతికి వస్తుండటంతో సంవత్సరానికి ఖర్చులన్నీ పోను రూ. 2 నుంచి 3 లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నట్లు తెలిపారు. సాగులో పూర్తిగా సేంద్రియ ఎరువులను మాత్రమే వాడుతున్నట్లు తెలిపారు. భార్యాభర్తలిద్దరూ సమన్వయంతో గాయలు సాగు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాగు చేసిన పంటను నేరుగా వీణవంకలో శుక్రవారం జరిగే సంతలో విక్రయిస్తుంటారు. జమ్మికుంట, కరీంనగర్ సంతలో కూరగాయల వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు నేరుగా అందిస్తున్నారు.

పరిస్థితులను బట్టి సాగుచేయాలి

గాండ్ల మహేందర్, కిష్టంపేట

నూతన విధానంతో మూడేళ్లగా కూరగాయల పంటలను సాగు చేస్తున్నా. సాగులో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని డ్రిప్ విధానం ద్వారా పంటను సాగు చేస్తున్నా. పరిస్థితులను బట్టి మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగు విస్తీర్ణం పెంచుతున్నాను. ప్రభుత్వం తరఫున చేయూతనందించాలని కోరుతున్నా.



అంతర్రాష్ట్ర మహిళా దొంగ పట్టివేత

● 31.5 తులాల బంగారం స్వాధీనం


నిందితురాలిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర మహిళ దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రఘు చందర్ విలేకరుల సమావేశం నిర్వహించి మహిళా దొంగను అరెస్టు చూపించి ఆమె వద్ద 31.5 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని పూర్తి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర ,నాగపూర్ సిటీలోని రామేశ్వరి టోలి ఏరియా ప్రాంతానికి చెందిన స్వప్న మిథున్ లాండే, హత్గాడే కాంత, హత్గాడే గుజాన, సంజన నాడే అనే నలుగురు మహిళలు బస్టాండ్‌లు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో సంచరిస్తూ దొంగతనాలు చేసే ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 16న ఈ ముఠా సభ్యులు జగిత్యాల పాత బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మిట్లపల్లి జలజ బ్యాగు నుంచి 37 తులాల బంగారు నగలను అపహరించుకవెళ్లారు. బాధితురాలు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ముఠాను పట్టుకునేందుకు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీముల ఏర్పాటు చేశారు. ముఠా సభ్యురాలు హత్గాడే కాంత సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులకు పట్టుబడింది. విచారణలో అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాలో సభ్యురాలిగా గుర్తించారు. ముఠా సభ్యులు నాగ్‌పూర్ నుంచి మంచిర్యాలకు ట్రైన్‌లో వచ్చి మంచిర్యాల, లక్షెట్టిపేట, జగిత్యాల, సిరిసిల్ల, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల్లో తిరుగుతూ బస్సులలో ప్రయాణించే వారిపై నిఘా పెట్టి విలువైన బంగారు ఆభరణాలు దోచుకునే ముఠాగా ఏర్పడినట్లు డీఎస్పీ వివరించారు. అరెస్టు చేసిన మహిళ వద్ద 31.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు మహిళా దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎస్సైలు కిరణ్ కుమార్, మన్మథ రావు, గీత ఉన్నారు.

గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గతంలో మండలంలోని ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న జ్యోతిబా పూలే బాలికల పాఠశాలను ఆయన సందర్శించినప్పుడు నీటి సమస్యతో ఇబ్బందుల పడుతున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మూడు రోజుల క్రితం బోరు వేయించగా సోమవారం బోరుకు మోటర్ అందించి నీటి పంపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ మెరుగుకోసం పాటుపడతానన్నారు. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు యగ్నేష్, మండలాధ్యక్షుడు మనోహర్ పాల్గొన్నారు.

కేసు భయంతో.. ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి చిన్న నర్సయ్య(45)అలియాస్ ఇచ్చన్న అనే యువకుడు పోలీసు కేసు భయంతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి నవీన్, జంగిటి చిన్న నర్సయ్య ఇద్దరూ కలిసి గ్రామ శివారులోని ఓ మామిడి తోట వద్ద శనివారం రాత్రి జంతువులను వేటాడేందుకు వెళ్లారు. అంతకు ముందే అక్కడ వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు నవీన్ కాలికి తగలడంతో విద్యుదాఘాతంతో అదే రాత్రి నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నర్సయ్యపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి చిన్న నర్సయ్య ఇంటికి రాకుండా పరారీలో ఉన్నాడు. ఈ భయంతోనే గ్రామ శివారులోని తన పొలం పక్కన సోమవారం ఉదయం చెట్టుకు ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సయ్య భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూమి విక్రయిస్తానని డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వ్యక్తిపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన వల్లెపు మొగిలికి బుగ్గారం మండల కేంద్రంలో 13 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి పక్కనే జక్కుల లింగారెడ్డికి 5.05 ఎకరాల భూమి ఉండగా రూ. 60 లక్షలకు మొగిలికి విక్రయించేందుకు లింగారెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నాడు. డబ్బులు ముట్టినప్పటికీ లింగారెడ్డి తన భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా వేరే వ్యక్తికి కొంత భూమిని విక్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు లింగారెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై జగిత్యాల టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన అడువాల కృష్ణ అనే వ్యక్తి ఆదివారం రాత్రి పట్టణంలోని యావర్ రోడ్ నుంచి తన కారులో వెళుతుండగా అకారణంగా ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కారు అద్దాలు ధ్వసం చేయడంతో పాటు కృష్ణపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్దెల యశ్వంత్, ఆలకుంట విజయ్, రెడ్డిమల్ల స్నేహిత్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

బాలుడిపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాలుడిపై అత్యాచారం కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాషిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపూర్ గ్రామానికి చెందిన గోగుల సాయి కుమార్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఓ బాలుడిని మామిడి కాయలు తెచ్చుకుందామని చెప్పి గ్రామ శివారులోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై మల్లాపూర్ అప్పటి ఎస్సై పృథ్వీధర్ కేసు నమోదు చేశారు. సీఐ రవి కుమార్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు సాక్షాలను, శాస్త్రీయ ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సాయికుమార్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కథలాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుంపెటకు చెందిన సిరసు పెద్దరాజం (65) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. రోడ్డు పక్కన బైక్‌పై వెళ్తున్న పెద్దరాజంను రమేశ్ అనే మేస్త్రీ ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం బొంపల్లి అనుబంధ గ్రామమైన మేరపల్లికి చెందిన ఒల్లపు రాజమ్మ పూరి గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. ఒళ్లపు రాజమ్మ పొలం పనులకు వెళ్లగా సోమవారం ప్రమాదవశాత్తు ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. మహిళా గ్రూపుల ద్వారా తీసుకున్న రూ.1.65 లక్షల నగదు, తులం బంగారం, పది తులాల వెండి, నిత్యావసర వస్తువులు, బీరువా, టీవీ నిత్యావసర సరుకులు దగ్ధం అయినట్లు బాధితురాలు రాజమ్మ పేర్కొంది.

కాలువల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలి

సారంగాపూర్, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : కాలువల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని జిల్లా కలెక్టరు సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి, సారంగాపూర్ మండ లంలోని రేచపల్లి, రంగపేట గ్రామాల్లో ఉన్న ఎస్సారెస్పీ డి 53, 12 ఎల్ఆర్ కాలువలను కలెక్టరు సత్యప్రసాద్ ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కెనాల్ దెబ్బతిన్న ప్రాంతంలో డ్రాఫ్ట్ మరమ్మతుల కోసం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే రేచపల్లి, రంగపేట కాలువల్లో పూడిక తీత పనులకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయా మండలాలకు ఓటి ఆప్టెక్ ద్వారా 64 వేల ఆయకట్టుకు నీరందించాలని, రేచపల్లి కెనాల్ ద్వారా సారంగాపూర్ బీర్‌పూర్ మండలాల చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డీఆర్‌డీవో రఘు వరణ్ ఉన్నారు.

బాలిక అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

కరీంనగర్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని మోసం చేసి బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి డి వెంకటేష్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కొత్తపెల్లి మండలం రేకుర్తికి చెందిన కుంచం రవి, ఒక బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి తన వెంట సెప్టెంబరు 20, 2021న తీసుకొని వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ విజ్ఞానరావు దర్యాప్తు జరిపి అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ డి శరత్ సాక్షులను ప్రవేశపెట్టి విచారించారు. నేరం నిరూపణ కావడంతో జిల్లా జడ్జి నిందితుడికి 10 సంవత్సరాల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ, తక్కళ్లపల్లి, దూలూరు పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. శనివారం రాత్రి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్, పోలీసు సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మూడు రోజులు గడుస్తున్నా కేసు నమోదు చేయలేదు. ఈ విషయమై ఎస్సై నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా రెవెన్యూ అధికారుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ ప్రసాద్

కమాన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపల్లి గ్రామానికి చెందిన వరాల సాత్విక్ తన ఫోన్‌ను పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ని గుర్తించి సోమవారం ఫిర్యాదుదారుడు వరాల సాత్విక్‌కు ఎస్ఐ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫోన్‌ను పొగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి అందిస్తామని, బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

యాసంగి సాగుకు నీటిని విడుదల చేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల యాసంగి సాగుకు ఎల్ఎండీ కెనాల్ నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గిట్ల ముకుందరెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్ ప్రారంభమై నారు మడులు ఎదిగినప్పటికి రైతాంగం నాట్లు వేసుకోవాలంటే నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం కెనాల్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయినటువంటి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేద వారికి వెంటనే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, చంద్రయ్య, సారయ్య, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూమిని దున్నకుండా అడ్డుకున్న వ్యక్తి అరెస్టు

చందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమి దున్నకుండ అడ్డుకోవడంమే కాకుండా పంట సాగు చేస్తే చంపుతా నని బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై అంజయ్య సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలం లోని అనంతపల్లి గ్రామానికి చెందిన సింధర వేణి నారాయణ సలెంద్ర మల్లయ్య వద్ద 1. 35 భూమి కొనుగోలు చేశాడు. కొను గోలు చేసిన భూమిలో నారాయణ, సత్తవ్వ అతని కుమారుడు శ్రీధర్‌లు కలిసి భూమిని సాగు చేస్తుండగా, ఇదే గ్రామానికి సలేంద్ర గంగయ్య భూమిలో పంట సాగు చేయవద్దని భూమిలో పంట సాగు చేస్తే చంపుతానని బెదిరిస్తున్నాడని నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సలేంద్ర గంగయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

పంట ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు

చందుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తనకున్న వ్యవసాయ భూమిలో వరి పంటను సాగు చేయగా రామన్నపేట, ఆసిరెడ్డిపల్లి చెందిన కొందరు వ్యక్తులు పంట చేనులో బండరాళ్లు వేసి పంటను ధ్వంసం చేశారని న్యాయం చేయాలంటూ దళిత మహిళ రైతు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. బాధిత దళిత మహిళ రైతు కథనం ప్రకారం మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన పురుగుల నర్సవ్వకు చందుర్తి గ్రామ శివారులో సర్వే నం: 198/ఆ/ఆ/2, విస్తీర్ణము ఎకరం 35 గుంటలు కలదు. భూమిని సాగు చేసుకొంటు అందులో వచ్చిన పంటను అనుభవిస్తునది.

రామన్నపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో పాటు ఆసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాకేష్, రాజ, దేవయ్య అనే వ్యక్తులు ఈ నేల 21న రాత్రి వేళలో భూమిలోని వరినారులో బండలు వేసి వరినారును ధ్వంసం చేశారని తెలిపింది. గత సంవత్సరము కూడ వరి పంట చేతికి అందే సమయంలో ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారన్నారు. భూమి దగ్గరికి పోతే నన్ను నా కుటుంబ సభ్యులందరిని చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్నారని, రక్షణ కల్పించి, న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కొండగట్టు హరిత హోటల్‌లో అరకొర వసతులు

● గదుల అద్దెకే పరిమితం ● టిఫిన్స్, భోజనం దొరకక భక్తుల ఇబ్బందులు


కొండపైన ఉన్న హరిత హోటల్

మల్యాల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో కొండపైన పదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వ పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరిత హోటల్ పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదు. గదుల అద్దెతో పాటు హోటల్ నిర్వహణ అందుబాటులో ఉంటూ కొండపైకి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు టీ, టిఫిన్స్, బోజనం అందించాల్సి ఉండగా కొన్నేళ్లుగా హోటల్ నిర్వహించడం లేదు. దీంతో హరిత హోటల్ ఉందని వచ్చే భక్తులు బోజనం, టిఫిన్స్ దొరక్క తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హరిత హోటల్ మొదటి, రెండవ అంతస్తులో పది గదులు అద్దెకు ఇస్తుండగా గ్రౌండ్ ఫ్లోర్‌లో హోటల్ నిర్వహించే వారు. అయితే ఇప్పుడు హోటల్ అందుబాటులో లేదు. కరోనా కాలం నుంచి హోటల్ మూలన పడగా ఓ ఏడాది పాటు స్థానికులు లీజుకు తీసుకున్నారు. లీజు సొమ్ములు ఎక్కువ అవుతున్నాయని గిట్టుబాటు కావడం లేదని లీజుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇక పది గదులలో 8 ఏసీ, 2 సాధారణం గదులు కాగ అవి కూడా కొండపైన భక్తుల రద్దీ ఉన్నప్పుడే ఆన్‌లైన్‌లో బుక్ అవుతున్నట్లు నిర్వహకులు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 11 మంది డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 11 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఐదుగురు, ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కరీంనగర్‌లో ఇద్దరు డీబార్ అయినట్లు తెలిపారు.

వేతనాలు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఐ కృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతూ రాష్ట్ర అంసెబ్లీ తీర్మానం చేయాలని బొతరకార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరంతా చాలీచాలని వేతనాలతో ఇబ్బందికర పరిస్థితుల్లో కుటుంబాలను పోషించుకుంటున్నట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తున్నాయని అన్నారు. జీవో నంబర్ 22ను గెజిట్ చేయాల్సి ఉన్నా పక్కనబెట్టారని, దాన్ని గెజిట్ చేస్తే కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరుగుతుందని కృష్ణ తెలిపారు. గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఇటీవల అసెంబ్లీలో కొందరు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై మాట్లాడారని, వారి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతూ తీర్మానం చేయాలని కృష్ణ డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్, నాయకులు కుందారపు శారద, లింగయ్య, అంజలి, ధర్మేందర్ పాల్గొన్నారు.


విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్ద ఉంచుకుని విద్యావ్యవస్థపై సమీక్షలు లేకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖాధికారులు వత్తాసు పలుకుతున్నారు. శ్రీ చైతన్య, నారాయణ కళాశాలల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై వెంటనే విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి విద్యాశాఖకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలన్నారు.

ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, సాయికృష్ణ, శ్రావణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమందలే ఆధారం



ఆవులే వారికి జీవనాధారం. తరతరాల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కుటుంబాలను పోషించు కుంటున్నారు. వందల సంఖ్యలో ఆవులను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. పొలాల్లో ఆవుల మందలను మేపడంతోపాటు వ్యవసాయ అవసరాలకు కోడెలను విక్రయించి ఆదాయం సమకూర్చు కుంటారు. ఏడాదిలో ఆరు నెలలపాటు సంచారం చేసి తిరిగి సొంత ఊర్లకు చేరుకుంటారు.

● ఆవులతో ఉపాధి పొందుతున్న గిరిజన రైతులు ● భూసారం పెంచుకునేందుకు రైతుల ఆసక్తి

రుద్రంగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆవులే ప్రధాన ఆదాయ వనరుగా రుద్రంగి మండలం గిరిజన తండాలకు చెందిన పలువురు రైతులు ఉపాధి పొందుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సుమారు 20 మంది గిరిజన రైతులు ఆవుల మందలను సాదుతున్నారు. ఒక్కో మందలో 200వరకు ఆవులు ఉంటాయి. ఏటా ఆరు నెలలపాటు ఆవుల మందలను ఊరూరా తిప్పుతారు. స్థానిక రైతులు రాత్రిపూట ఆవులను తమ పొలాల్లో ఉంచాలని కోరు తుంటారు. ఆ రోజు రాత్రి మొత్తం పొలంలో ఆవులు, మూత్రం, పేడ వేస్తాయి. దీంతో భూమి సారవంతమై దిగు బడులు పెరగడంతోపాటు ఆరోగ్యకరమైన పంటలు పండుతాయి. కొంత మంది రైతులు వారం నుంచి పది రోజుల వరకు తమ పొలాల్లో ఆవుల మందలను మేపుతారు. యజమానికి 500 పశువుల మందకు రోజుకు రూ.6 వేల నుంచి రూ.7వేలు, పది రోజులపాటు పొలంలో కట్టేస్తే సుమారు రూ.70 వేల వరకు చెల్లిస్తారు. వీటితో పాటు రోజుకు 10 కిలోల చొప్పున బియ్యం ఇస్తారు. దీంతోపాటు మందలోని కోడెలను వ్యవసాయ అవసరా లకు రైతులకు విక్రయిస్తారు. ఏటా నవంబరులో వరి కోతలు ప్రారంభమైనప్పటి నుంచి ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఆరు నెలల పాటు ఆవుల మంద లతో సంచారం చేస్తారు. సాగు పనులు మొదలయ్యాక సొంత గ్రామాలకు తిరిగి వస్తారు. అటవీ ప్రాంతంలో ఆవులను మేపుతూ వారికి ఉన్న కొద్దిపాటి భూమిలో పంటలు పండిస్తూ జీవనం సాగిస్తారు.



పొలంలో ఆవుల మంద

భూసారం పెంపునకు ఆవుల మంద

ఎర్రం అరవింద్, రైతు, రుద్రంగి



మా పొలంలో భూసారం పెంచడం కోసం 10 రోజులపాటు ఆవుల మందను ఉంచాం. పశువుల మల,మూత్ర విసర్జనలతో భూసారం పెరుగుతుంది. పశువుల మంద మా పొలంలో ఉంచడానికి రోజుకు రూ.7 వేలు చెల్లించాను. డబ్బులతోపాటు 10 రోజులకు రోజుకు పది కిలోల చొప్పున బియ్యం అందజేశాను. ఉండడానికి ఇతర సౌకర్యాలు కూడా కల్పించాం.

ఆరు నెలలపాటు సంచారం

మాలోత్ తిరుపతి, ఆవుల మంద యజమాని



నవంబరులో వరి కోతలు ప్రారంభమైనప్పటి నుంచి ఆవుల మందతో సంచారం చేస్తాం. భూసారం పెరుగుతుందని రైతులు ఆవుల మందను పొలాల్లో కట్టేస్తారు. మందను వ్యవసాయ భూముల్లో ఒక రోజు ఉంచినందుకు ఆవుల సంఖ్యను బట్టి డబ్బులు, బియ్యం చెల్లిస్తారు. రైతులకు ఉన్న భూమిని బట్టి వారం నుంచి పది రోజులపాటు ఉంచుకుంటారు.

ఇద్దరికి రైతునేస్తం పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్/ జమ్మికుంట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దుబ్బాక వనజ, జమ్మికుంటకు చెందిన పుల్లూరి రాజ్యలక్ష్మి తుమ్మేటి రఘోత్తంరెడ్డి మిద్దెతోట పురస్కారానికి ఎంపికయ్యారు. సోమవారం గుంటూరు జిల్లాలో రైతు నేస్తం ఫౌండేషన్ అవార్డులను ప్రదానం చేసింది. తెలంగాణ, అంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 30 మందికి పురస్కారాలు అందిం చగా వనజ, రాజ్యలక్ష్మిలు పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు, వ్యవసాయ శాఖ సంచాల కుడు, ఐఏఎస్ అధికారి ఢిల్లీరావు, మిద్దెతోట నిపుణుడు రఘోత్తంరెడ్డి, ఫౌండేషన్ ఛైర్మన్ పద్మశ్రీ వేంకటేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు. పురస్కారం కింద ప్రశంసాపత్రం, జ్ఞాపిక, ఆకుపచ్చని కిరీటం, శాలువా అందించి సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో మిద్దెతో టలు, పెరటి తోటల పెంపకం చేస్తూ పకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వారికి 2021 నుంచి రైతునేస్తం ఫౌండేషన్ వారు ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. రసాయానిక ఎరువులు, పురుగు మందులు వాడని ఆహార దినుసులు, కూరగాయలు, ఆకుకూరలు పండించడాన్ని రైతునేస్తం ప్రోత్సహిస్తుంది. గత 10 సంవత్సరాలుగా తుమ్మేటి రఘోత్తంరెడ్డి మిద్దెతోటలను, పెరటి తోటలను విరివిగా ప్రచారం చేస్తున్నారు.



పురస్కారం అందుకుంటున్న దుబ్బాక వనజ



రైతునేస్తం పురస్కారంతో పుల్లూరి రాజ్యలక్ష్మి

ఉమ్మడి జిల్లాలో సీఎం కప్ క్రీడాపోటీలు



ఆర్చరీ పోటీలో పాల్గొన్న బాలబాలికలు



రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలు..

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం ఆర్చరీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ బాలబాలికల పోటీలు జరిగాయి. ముఖ్య అతిథి జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఆర్చరీ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాలలో తమ ప్రతిభను కనబరిచారు. ఇండియన్ రౌడ్ 20 మీటర్లు, 30 మీటర్లు, రికర్వ్ 60 + 60 మీటర్లు, కాంపౌండ్ 50 + 50 మీటర్ల విభాగాలలో బాలబాలికలు పోటీ పడ్డారు. ఆర్చరీ వివిధ విభాగాలలో గెలుపొందిన బాలబాలికలకు ముఖ్య అతిథులు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా నాయకులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు, బాలబాలికలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఉషు పోటీలు..

కరీంనగర్ స్పోర్ట్స్ : జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫండస్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన సీఎం కప్ 2024 ఉమ్మడి జిల్లా ఉషు పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో అండర్-14, అండర్-18 విభాగాల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎంకప్ ఉషు పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా ఉషు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, ఫండస్ పాఠశాల ఛైర్మన్ గోపు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు.



సెమీఫైనల్‌కు చేరిన జిల్లా బాలికల జట్టు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సెమీఫైనల్‌కు చేరింది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాలికల జట్టు విశేష ప్రతిభచాటి క్వార్టర్ ఫైనల్స్‌లో హన్మకొండ జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్ సంయుక్త కార్యదర్శి సీహెచ్ సంపత్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులను, కోచ్ పద్మలను సంఘ అధ్యక్షుడు డాక్టర్ అమిత్‌కుమార్ అభినందించారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు వెల్ది విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్ : బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 68వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు జిల్లాకు చెందిన వెల్ది ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కె.రాంచరణ్ ఎంపిక య్యా డు. గత నెల 10, 11, 12 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటిన రాంచరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండీ యూనిస్‌పాషా తెలిపారు.



రాంచరణ్

పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

● మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 51 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కావద్దనే కల్యాణలక్ష్మి పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అంతకుముందు ఇల్లంతకుంట స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.ప్రభుత్వం రాష్ట్రంలో ఆటల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. సీఎం కప్ పోటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, అయిలయ్య, ఉప్పుల అమేందర్, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, బాలపోచయ్య, ప్రసాద్, ఒగ్గు రమేష్, చల్ల నారాయణ, తిరుపతి, పుష్పలత, నరేష్, ప్రదీప్‌రెడ్డి, ఉస్మాన్, బెజ్జంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజన్నకు భక్తుల మొక్కులు



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పార్వతిపరమేశ్వరులకు ఎంతో ఇష్టమైన సోమవారం రోజున శ్రీస్వామి వారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం దర్శనం క్యూలైన్‌లలో బారులు తీరారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు కట్టేందుకు క్యూలైన్‌లో భక్తులు సమారుగా రెండు గంటలు నిరీక్షించి ఆలయంలోకి చేరుకుని ఆది దేవుడిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గండదీపంలో నూనే పోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకుని, బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ అధికారులు తిరుపతిరావు, రాజేందర్, అశోక్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకున్నారు. సోమవారం రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకుని శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అయ్యప్పమాల వేసుకున్న నేపత్యంలో రాజన్న ఆలయానికి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అంతర్గాం స్పిన్నింగ్ భూములు అన్యాక్రాంతం

● ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేసిన కాందిశీకులు ● టెక్స్‌టైల్స్, రెవెన్యూ అధికారులు సీరియస్

గోదావరిఖని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం స్పిన్నింగ్ మిల్లుకు చెందిన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం, స్పిన్నింగ్ మిల్లు ఆస్తులకు సంబంధించి లిక్విడేటర్ నిర్లక్ష్యాల కారణంగా స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించి 51.38ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులు అన్యాక్రాంతం చేస్తున్నారు. ఇంతకాలం చిన్న చిన్న నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు క్రమంగా లేఅవుట్‌ల దాకా వెళ్లారు. అంతర్గాంలో స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించిన భూములు సుమారు ఎకరానికి రెండు కోట్ల రూపాయల దాకా మార్కెట్ ధర పెరగడంతో భూమాఫియా ఈ భూములపై కన్నువేసింది. అయితే స్పిన్నింగ్ మిల్లు భూములకు సమీపాన ఉన్న పట్టా యజమానుల అండగా చేసుకుని ఈ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు.

బర్మా, శ్రీలంక కాందిశీకుల సంఘం అన్యాక్రాంతమవుతున్న స్పిన్నింగ్ మిల్లుల భూముల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అంతర్గాం టెక్స్‌టైల్స్ కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్ లిమిటెడ్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించారు. సోమవారం టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సంతోష్, అంతర్గాం తహసీల్దార్ రవీందర్ క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.

ఆక్రమణదారులను పిలిపించి ఇందులో జరిగిన నిర్మాణాలకు అనుమతి లేదని, ఈ భూములు మీవా, స్పిన్నింగ్ మిల్లువా తేలే వరకు ఎలాంటి నిర్మాణాలు, లే అవుట్‌లు చేయవద్దని హెచ్చరించారు. ఇందు కోసం జాయింట్ సర్వే నిర్వహిస్తామని, తరువాత ఆక్రమణకు గురైన భూములు ఎవరివో తేల్చుతామని చెప్పారు.



మిల్లు భూముల్లో చేపట్టిన నిర్మాణం

● పూర్వాపరాలు పరిశీలిస్తే ...

1991లో స్పిన్నింగ్ మిల్లు బంద్ అయ్యింది. అప్పుడు 435మంది కార్మికులు స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నారు. 1998లో వీఆర్ఎస్ కింద కార్మికులను పూర్తిగా ప్రభుత్వం తొలగించింది. మిల్లు ఆస్తులు, భూములు విక్రయించి కార్మికుల బకాయిలు చెల్లించాలని లిక్విడేటర్‌ను నియమించింది. టెక్స్‌టైల్స్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లిక్విడేటర్‌గా నియమితులయ్యారు. ఇందులో భూముల సమస్యలు ఉన్న నేపథ్యంలో 2014లో అప్పటి జాయింట్ కలెక్టర్‌ను లిక్విడేటర్‌ను చేశారు. అప్పటికి కార్మికులకు 5.5కోట్ల రూపాయలు వేతనాల కింద మిల్లు బాకీ పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు లిక్విడేటర్‌గా ఉన్న అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదు. పైగా ఈపీఎఫ్‌కు కూడా మిల్లు బాకీ పడడంతో కార్మికుల పీఎఫ్ కూడా ఆగిపోయింది.

2022లో మిల్లులో ఉన్న యంత్రాలను విక్రయించి కొంత ప్రావిడెంట్ ఫండ్‌కు జమ చేసినప్పటికీ అవి సరిపోలేదు. మిల్లు యంత్రాల అమ్మకంలో కూడా టెండర్ ప్రక్రియ నుంచి యంత్రాలను అమ్మే ధర వరకు అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈపీఎఫ్‌కు పెనాల్టీలు, వడ్డీలు కోటి రూపాయల బకాయి తేలింది. దీంతో 185మందికి మాత్రమే పెన్షన్ అందుతున్నది. మరో 175మందికి పెన్షన్ కూడా రావడం లేదు. స్పిన్నింగ్ మిల్లుకు ఉన్న 51ఎకరాల భూములను అవస రం మేరకు అమ్మేసి కార్మికులకు చెల్లించాల్సిన 5.5కోట్ల రూపాయలతో పాటు ఈపీఎఫ్‌కు బాకీ ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే స్పిన్నింగ్ కార్మికులకు సంబంధించిన సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది. కానీ లిక్విడేటర్లు స్పిన్నింగ్ మిల్లు అంశాన్ని నిర్లక్ష్యం చేయడం కారణంగా కార్మికుల ప్రయోజనాలతో పాటు స్పిన్నింగ్ మిల్లు భూములు, ఆస్తులు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి. దీంతో కాందిశీకుల సంఘం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు ఫిర్యాదు మేరకు ఇటు టెక్స్‌టైల్స్ అధికా రులు, అటు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇప్పటికైనా స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించిన 51ఎకరాల భూమిని ప్రభుత్వం హద్దులు పాది స్వాధీనం చేసుకోవాలని, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, ఈపీఎఫ్‌కు కట్టాల్సిన సుమారు కోటి రూపాయలను చెల్లించాలని బర్మా, శ్రీలంక కాందిశీకుల సంఘం డిమాండ్ చేస్తున్నది.

ఏడాది పాలనలో కాంగ్రెస్ విఫలం

● మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం తప్పా మిగతావి అమలులోకి రాలేదని అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సీఎంగా కేసీఆర్ వేములవాడ పర్యటనలో ముంపు గ్రామాల నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఇచ్చిన హామీ నిలుపుకోలేదని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారని, ముంపు గ్రామాల నిర్వాసితులకు అప్పటికే పరిహారం ఇవ్వడంతో చట్టప్రకారం చేయలేక పోయామని అన్నారు. ఎన్నికల సమయంలో ముంపు గ్రామాల నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూంలు ఇస్తామన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఇస్తే స్వాగతిస్తామన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనకు వచ్చినప్పుడు రెండు జీవోలు ఇచ్చారని, జీవోలో మిగిలిన 4,696 మంది నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారని అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉండగా ముంపు గ్రామాల నిర్వాసితులకు రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, పది వేల ఫైచిలుకు నిర్వాసితుల్లో ఇల్లు, పరిహారం రానివారికి ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నీటి మాటలయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి కాళ్లేశ్వరం నీల్లు లేకుండనే ధాన్యం పడిందని చెప్పారని, ముఖ్యమంత్రి, మంత్రులకు కాళ్లేశ్వరంపై అవగాహన లేదని అన్నారు. హైదరాబాద్‌కు మంచినీళ్లు, మూసి ప్రక్షాళనకు మల్లనసాగర్ నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని, మల్లన్నసాగర్ అనేది పార్ట్ ఆఫ్ కాళ్లేశ్వరమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి సంవత్సకాలం పూర్తయ్యిందని, మేడిగడ్డ ప్రాజెక్టును రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. భూకంపం వచ్చినా మేడిగడ్డ సెంటి మీటర్ కదలలేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డి వేణు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వినతులు వెల్లువెత్తాయి. ఎన్నో అవస్థలు పడుతూ ప్రజావాణిలో ఫిర్యాదులు చేసేందుకు అర్జీదారులు వస్తున్నారు. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడే ప్రారంభమైన ప్రజావాణికి దరఖాస్తుల సంఖ్య తగ్గడం లేదు. దివ్యాంగులు, వృద్ధులు పడరాని పాట్లు పడి ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. కొందరు భూముల సమస్యలు, మరి కొందరు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, ఇతరత్ర సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి మొర పెట్టుకుంటున్నారు. వృద్ధులు దివ్యాంగుల వెంట సహాయకులను తీసుకొని రావల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు ఇదివరకు దరఖాస్తు చేసుకున్న సమస్య పరిష్కారం కాకపోవడంతో కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రజావాణిలో పాల్గొన్న ఉన్నతాధికారులు మాత్రం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి వేణు ప్రజల దరఖాస్తులను స్వీకరించారు.

● పింఛన్ ఇప్పించాలి



- మల్క హరి, తాడిచెర్ల

నాకు ప్రభుత్వ పింఛన్ రావడం లేదు. మా అమ్మానాన్నలు ఉద్యోగులుగా రిటైర్డ్ అయ్యి మృతి చెందారు. వారి నుంచి రావాల్సిన బ్యాంకు ఎకౌంటు క్లోజ్ చేస్తే వారి పింఛన్ నాకు వస్తుంది.

ట్రైసైకిల్ ఇప్పించాలి..

- సుమన్, కమాన్‌పూర్



ఏడాది క్రితం నాకు రెలు ప్రమాదంలో కాళ్లుపోయాయి. వికలాంగుల పింఛన్‌తో పాటు ట్రై సైకిల్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నా.

● మంథని గీత పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని కే శంకర్ గౌడ్ అనుమతి లేకుండా ఈత తాటి చెట్లను గీస్తున్నారని, ఇతనిపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, సంబంధిత అధికారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుని గీత కార్మికులు న్యాయం చేయాలని మంథని పట్టణానికి చెందిన ఏ శంకర్ గౌడ్ దరఖాస్తు చేశాడు. అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అబ్కారీ శాఖ అధికారిని అదనపుకలెక్టర్ ఆదేశించారు.

● రామగుండం ఆరో డివిజన్‌కు చెందిన ఎం లక్ష్మణ్ వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

● ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బి సంతోష్‌నాయక్ తనకు టీ స్టాల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, దానికి సంబంధించిన డబ్బులు త్వరగా వచ్చేటట్లు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసకున్నాడు. వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిని ఆదేశించారు.

● అంతర్గాం మండలం లింగాపూర్‌లో లెదర్ పార్క్ ఏర్పాటు చేయాలని దళిత చర్మకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంతర్గాం మండలం లెదర్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు.

ఫటాఫట్

'మహాలక్ష్మి'తో డిపో ఆదాయం పెరిగింది

గోదావరిఖని డిపో మేనేజర్ ఎం నాగభూషణం



ఆంధ్ర జ్యోతి: మహాలక్ష్మి పథకంతో గోదావరిఖని డిపోకు లాభమా? నష్టమా?

డీఎం: మహాలక్ష్మి పథకంతో గోదావరిఖని డిపో ఆదాయం పెరిగింది. గతంలో రోజూ రూ.24లక్షలు వచ్చేది. ఇప్పుడు రూ.33లక్షలు వస్తుంది. ఇందులో రూ.18లక్షల వరకు నగదు వస్తుండగా మిగతావి మహాలక్ష్మీ ఆదాయం.

ఆంధ్రజ్యోతి: గోదావరిఖని డిపోలో సర్వీసుల సంఖ్య తగ్గిందంటున్నారు?

డీఎం: సర్వీసుల సంఖ్య తగ్గలేదు. డిపో సర్వీసులు గతంలో రోజుకు 48వేల కిలో మీటర్లు తిరిగితే ఇప్పుడు 52వేల కిలో మీటర్లు తిరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: శ్రీశైలం, తిరుపతి సర్వీసులు పునరుద్ధరిస్తారా?

డీఎం: ఆ ఆలోచన లేదు. రద్దైన శ్రీశైలం సర్వీసును హైదరాబాద్‌కు నడుపుతున్నాం. దీంతో ట్రిప్పుల సంఖ్య పెరిగింది.

ఆంధ్రజ్యోతి: ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, పెట్రోల్‌బంక్ ప్రతిపాదన ఉందా?

డీఎం: ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు ప్లాట్‌ఫాంలు, టాయ్‌లెట్‌ల విస్తరణకు ప్రతిపాదన పంపాం. పెట్రోల్ బంక్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: డిపోకు ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయా?

డీఎం: డిపోనకు ఎలక్ట్రికల్ బస్సులు ఇచ్చే ప్రతిపాదన లేదు. కరీంనగర్ నుంచి గోదావరిఖనికి ఎలక్ట్రికల్ సర్వీసులు నడపనున్నారు.

- కళ్యాణ్‌నగర్

ఉచిత వైద్య పరీక్షలు

రామగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సోమవారం ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్య ఉచిత షుగర్ వైద్య పరీక్షలను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎస్వోటూ జీఎం రఘుపతి ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత షుగర్ వైద్య పరీక్షల స్టాల్స్‌ను ప్రారంభించారు. వైద్య పరీక్షలతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శరణ్య వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, సంతోష్, శేషికుమార్, మారుతి, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడి పూజ



అగ్నిగుండంపై నడుస్తున్న దీక్షాపరులు

మంథని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారికి 18 మెట్ల పూజను, దీక్షాపరులకు అగ్నిగుండాల కార్యక్రమాలను ఆదివారం అర్ధరాత్రి వరకు వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన సంజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో గణపతి, సుబ్రమణ్యేశ్వరుడు, శివుడు, విష్ణువు సమేత శ్రీ అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి 18 మెట్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఒక్కోక్క మెట్టుకు ప్రత్యేక అలంకరణతో పూజలను సంజీవ్ నంబూద్రి గురుస్వామి నిర్వహించారు. ఆనంతరం ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించి దీక్షాపరులు, భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణంలో అగ్ని గుండంలో నిప్పులపై దీక్షా పరులు నడుచుకుంటూ వెళ్లి అయ్యప్ప స్వామిపై భక్తిని చాటుకున్నారు. ఆనంతరం దీక్షా పరులు, భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. అర్ధరాత్రి వరకు ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక శోభతో అయ్యప్ప స్వామి మెట్ల పూజ, దీక్షాపరుల అగ్ని గుండాలు కన్నుల పండువగా కొనసాగాయి. సోమవారం దీక్షాపరులకు ఆలయ అవరణలో అంకరి మానస-ప్రకాష్, మోత్కూరి స్వర్ణలత-శ్రీ నివాస్, పోతరాజు వెంకటలక్ష్మీ-సమ్మయ్య, బర్ల శిరీష-సంపత్, బాసాని సాగర్ అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు, ఆలయ కమిటీ నిర్వాహకులు వొడ్నాల శ్రీనివాస్, ఎంఎస్ రెడ్డి, తోట రాజలింగం, జక్కుల చందు, కాయితోజు సమ్మయ్య, దీక్షా పరులు, భక్తులు ఆధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● అయ్యప్ప స్వామి రథోత్సవం

సుల్తానాబాద్: అయ్యప్ప స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక నీరుకుళ్ల రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి స్వాములతో కలసి బయలు దేరిన స్వామి వారి రథోత్సం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తుల స్వాముల నృత్యాలు, మహిళల కోలాటాల మధ్యన, మేళ తాళాలతో చేరుకుంది. అక్కడ స్వామి వారికి చక్రస్నానం చేయించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి తిరిగి అయ్యప్ప స్వామి నగర సంకీర్తన చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్లు పల్లా మురళి సదాలక్ష్మీ, బుచ్చిరెడ్డి, గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం తో సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష అభియాన్ లో కాంట్రాక్టు ఉద్యోగులు భిక్షటన చేస్తు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు తిప్పని తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుంబాల సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష అభి యాన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో చేస్తున్న వారిని రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వెంటనే హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

సాగు భూములకే రైతుభరోసా

(5వ పేజీ తరువాయి)

భూములు సాగులో ఉన్నా, లేకపోయినా కూడా పట్టా కలిగిన వారందరికీ పెట్టుబడి సాయాన్ని ఏడాదికి రెండు సీజన్లకు కలిపి ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసింది. ప్రధాని కిసాన్ సమ్మాన్ పథకం కింద భూమి ఎంత ఉన్నా, 2019 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి పట్టాలు కలిగిన వారికి ఏడాదికి ఆరు వేల చొప్పున మూడు విడతల్లో సాయాన్ని అందజేశారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయ పన్ను చెల్లింపుదారులను మినహాయించారు. రైతుభరోసా పథకానికి ఇవే నిబంధనలను అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అర్హులైన రైతులకు ఎంత భూమి ఉంటే అన్ని భూములకు ఎకరానికి 7,500 రూపాయల చొప్పున రెండు సీజన్లకు 15వేల రూపాయలు ఇవ్వనున్నది. అలాగే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు 15 వేలు, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. దీనిపై ఇంకా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

● క్రాప్‌బుకింగ్ సర్వేను అనుసరించి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకం ద్వారా ఆయా సీజన్లలో పెరిగిన పట్టాదారులను అనుసరించి గత ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,46,819 మంది రైతులకు ఎకరానికి ఐదు వేల రూపాయల చొప్పున 136 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. అలాగే ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 67,332 మంది రైతులకు ఏడాదికి ఆరు వేల చొప్పున 40 కోట్ల 39 లక్షల 92 వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా పథకం ద్వారా లబ్ధి పొందే రైతుల సంఖ్య తగ్గనున్నది. జిల్లా వ్యవసాయ శాఖాధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1,55,496 మంది రైతులు 2,78,128 ఎకరాల భూములు కలిగి ఉన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం నిబంధనలను వర్తింపజేస్తే ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఐటీ హోల్డర్లు 20 వేల మంది వరకు ఉండవ చ్చని అంచనా. సాగుచేసే భూములకే రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన దృష్ట్యా సాగు భూములను ప్రతి సీజన్‌లో వ్యవసాయ శాఖ చేపట్టే క్రాప్‌బుకింగ్ సర్వేను అనుసరించి గుర్తించే అవకాశాలున్నాయి. చాలామంది 10 ఎకరాలకు మించి భూములు ఉన్న వారికి రైతుభరోసా ఇవ్వవద్దనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 10 లేదా 15 ఎకరాల వరకు సీలింగ్ పెట్టే అవకాశాలున్నాయి. అలా చేస్తే జిల్లాలో 10,884 ఎకరాల భూములు గల 829 మంది రైతులకు రైతు భరోసా దక్కక పోవచ్చు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సర్వర్ సమస్య

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సర్వే తలనొప్పిగా మారింది. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాల్లో ప్రజలు ప్రజాపాలన ద్వారా ఇళ్లులేని వారు దరఖాస్తు చేసుకున్నారు. అయితే మండల వ్యాప్తంగా 14,346 ఇళ్ల సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 50 శాతం మేర సర్వే పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు సర్వే కోసం వెళ్లగా ఎర్రర్ రావడంతో సర్వే ఆలస్యంగా సాగింది.

సమర శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో జనవరి 8న జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావం పోస్టర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మంథని డివిజన్ అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్, బీసీ విద్యార్థి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ అరవింద్, నాయకులు ప్రణయ్, సుమన్, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

రామగుండం ఫంక్షన్‌హాల్స్‌పై కార్పొరేషన్ కొరడా



గోదావరిఖనిలోని ఫంక్షన్‌హాల్

కోల్‌సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో అనుమతి లేని ఫంక్షన్‌హాల్స్‌కు భారీ జరిమానాలు విధించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది ఫంక్షన్‌హాల్స్‌కు పెనాల్టీ నోటీసులు జారీ చేసినట్టు కార్పొరేషన్ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా పెనాల్టీ చెల్లించకపోతే తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేషన్ పరిధిలో 43 ఫంక్షన్‌హాల్స్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఇందులో ఏ అనుమతులు లేని ఎనిమిది హాల్స్‌కు భారీ జరిమానాలు విధించారు. ఇందులో రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌కు రూ. 54,16,132, శ్రీమయి కన్వెన్షన్ హాల్, కాజిపల్లికి రూ. 84,44,425, ఎంఎస్ గార్డెన్స్‌కు రూ. 48,63,925, రెడ్డి కన్వెన్షన్ హాల్‌కు రూ. 60,37,213, దేవి గార్డెన్స్‌కు రూ. 82,92,000, జీఏ గార్డెన్స్‌కు రూ. 65,30,425, ఏఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌కు రూ. 44,59,975, శివ గార్డెన్స్‌కు రూ. 45,62,673 జరిమానా విధించారు. నాలాలు, రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరించారు.

● నిర్వాహకుల్లో గుబులు..

కార్పొరేషన్ పరిధిలో 40కిపైగా చిన్నా, పెద్ద ఫంక్షన్‌హాల్స్, బాంకెట్ హాల్స్ ఉన్నాయి. ఇప్పటికే 43 ఫంక్షన్ హాల్స్‌కు కార్పొరేషన్ నోటీసులు జారీ చేసింది. పలు పాఠశాలలు, రైస్‌మిల్లులు, నివాసాలను ఫంక్షన్ హాల్స్‌గా మార్చారు. 12వరకు బంకెట్ హాల్స్ ఉంటాయి. ఇబ్బడిముబ్బడిగా హాల్స్ పెరగడంతో వ్యాపారాలు తగ్గాయని ఈ పరిస్థితుల్లో తమపై వేటు వేసే ఇబ్బందులు పడతామని కొందరు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో మణికంఠ విద్యార్థుల ప్రతిభ

ధర్మారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) సీఎం కప్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ధర్మారం మండల కేంద్రంలోని సాయిమణికంఠ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

ఈ నెల 21న జగిత్యాల జిల్లాలో జరిగిన అండర్- 14 విభాగంలో పాఠశాలకు చెందిన కే అరుణ్, ఎం రిత్విక, ఎస్ హర్షినిలు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి పీఈటీ సాయికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

కిష్టంపల్లె గ్రామపంచాయతీ ఏర్పాటు నిలిపివేయాలి



వినతి పత్రాన్ని చూపుతున్న గ్రామస్థులు

కమాన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేయనున్న కిష్టంపల్లె గ్రామపం చాయతీ ఏర్పాటు నిలిపివేయాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కిష్టంపల్లి, బాపూజినగర్, పిల్లిపల్లె గ్రామాలను కలుపుతూ కిష్టంపల్లి గ్రామపంచాయతీ ఏర్పాటు చేయడం ద్వారా జీవనోపాధి, చెరువుల పంపిణీ, ఇతర ఉత్పన్నమయ్యే సమస్యల గురించి వినతిపత్రంలో వివరించారు. కార్యక్రమంలో నాయకులు కుక్క చంద్రమౌళి, గీత సంపత్‌కుమార్, రంగు సత్యనారాయణగౌడ్, నగునూరి నరసయ్యగౌడ్, పొన్నం వెంకన్న గౌడ్, బొంపల్లి రాజయ్య, జంగేపల్లి అజయ్, ప్రకాష్, భీమ్‌రాజ్, ఆరెపల్లి రాజు, మురాహిద్, కందుల రవీందర్ ఉన్నారు.



కోల్ ఇండియా వేతనాలు అమలు చేయాలి



ఆర్జీ-2లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందం మేరకు వేతనాలు అమలు చేయకుండా సింగరేణి యాజమాన్యం అన్యాయం చేస్తున్నదని, వెంటనే వేతనాలు పెంచాలని సింగ రేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ-2 పరిధిలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు కేటగిరిల ఆధారంగా అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ వేతనాలను చెల్లించడం లేదన్నారు. 18 రోజుల సమ్మె సదర్భంగా జరిగిన ఒప్పందాలను సైతం యాజమాన్యం తుంగలో తొక్కిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంచలేదని తెలిపారు. సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు సైతం వేతనాల పెంపుదల చేయించలేకపోయారన్నారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులతో సాధించలేనిది పోరాటాల ద్వారా సాధించుకుందామని ఉల్లి మొగిలి కాంట్రాక్టు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రామన్న, సమ్మయ్య, వేల్పుల రవి, రాజేష్, లక్ష్మణ్, సీహెచ్ రాజు, నాగరాజు, నరేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'మనోచైతన్య'ను సందర్శించిన సేవా అధ్యక్షురాలు

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని మనోచైతన్యను సోమవారం సింగరేణి ఆర్‌జీ-1 సేవా అధ్యక్షురాలు అనితాలలిత్‌కుమార్ సోమవారం సందర్శించారు. మనోచైతన్యలోని వివిధ విభాగాలను, పనితీరును పరిశీలించారు. అనంతరం ఒకరోజు ఖర్చును సుమారు ఏడు వేల రూపాయలను మహిళా క్లబ్ ఆర్‌జీ-1 నుంచి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మహిళా క్లబ్ సభ్యులు,మనోచైతన్య అధ్యక్షులు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

అన్నదాతలే దేశానికి వెన్నెముక





పెద్దపల్లిలో వేడుకల్లో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, మంథనిలో రైతులను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్

పెద్దపల్లి టౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): అన్నదాతలే దేశానికి వెన్నెముకలని పలువురు వక్తలు అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లిలో జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప పాల్గొని మాట్లాడారు. దేశంలో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. దేశానికి అన్నపూర్ణ రైతు అని, ఆ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని అన్నారు.

ఎమ్మెల్యే విజయరమణారావు రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని, పెద్దపల్లి ప్రాంత రైతాంగానికి పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించేందుకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఆమె కేక్ కట్ చేసి పలువురి రైతులను సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కూర మల్లారె డ్డి, డీఎంఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్విరాజ్, కార్యదర్శి సతీష్ కుమార్, ఏడీఏ శ్రీనాథ్, డైరెక్టరు, రైతులు, పాల్గొన్నారు.

ధర్మారం: దేశానికి అన్నం పెట్టే రైతులే నిజమైన హీరోలని ధర్మారం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామ పొలాల వద్ద రైతులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులతో కలిసి రైతులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజియన్ సెక్రటరీ మునీందర్, ముజాయిద్, ట్రెజరర్ కట్ట రమేష్, వీపీ3 నాడెం శ్రీనివాస్, సభ్యులు మల్లేశం, రైతులు జీళ్ల కనుకయ్య, మేడవేని చిన్నయ్య, గాజుల చంద్రయ్య, ఒడ్నాల రాజయ్య, రాంరెడ్డి, సతీష్, తిరుపతి పాల్గొన్నారు.

పాలకుర్తి: ఆరుకాలం కష్టపడి పంటలు పండించి దేశ ప్రజలకు అన్నం పెట్టె అన్నదాతలను అందరు గౌరవించాలని రామగుండం లయన్స్ క్లబ్ మగువ ప్రెసిడెంట్ గాలి సునీత అన్నారు. మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన లయన్ సోమారపు లావణ్య రైతులను సత్కరించారు.

● పాలకుర్తి గ్రామంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ సేవా సమితి చెర్మన్ మనాలి ఠాకూర్ సోమవారం మహిళ కూళీలతో కలిసి వరి పొలంలో నాటు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డి రైతుల ప్రయోజనాల కోసం పలు పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నాడ న్నారు. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయి అయా సమస్యలను పరిష్కరించడమే తన ఏకైక లక్ష్యమని మనాలి ఠాకూర్ అన్నారు.

మంథని: అందరికి అన్నం పెట్టే అన్నదాతలే దేశానికి వన్నుముకలాంటి వారని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. రైతులు పేరవేన లింగయ్య, కదుదుల వెంకన్న, గుండా పాపారావు, మూల పరుషోత్తంరెడ్డి, నరెడ్ల ఓదెలు, పెంటరీ రవిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ, రూ. 500 బోనస్‌లు అమలు చేసిందన్నారు. త్వరలో రైతు భరోసా కూడ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

సుల్తానాబాద్: రైతు దినోత్సవం పురస్కరించుకుని స్థానిక అల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సోమవారం విద్యార్థులతో కలసి పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాట్లు వేసే పద్ధతిని వారికి ప్రత్యక్ష్యంగా చూపించడమే కాకుండా పంట కోతల వరకు ఎదిగే దశల గురించి వివరించారు. విద్యార్థులతో నాట్లు వేయించారు. మహిళా రైతులు కూలీలతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉత్తమ మహిళ రైతు మాధవిని ఈ సందర్భంగా సన్మానించారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ముత్తారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దరియాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై గైడ్ టీచర్ కోట కిషోర్‌బాబు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ కుమార్ కేసరి మాట్లాడుతూ పదో తరగతి తరువాత వివిధ కోర్సులు, విద్య అవకాశాలు గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. పదవ తరగతి తరువాత ఏమి చదవాలి అనే సందేహంతో ఉన్న ప్రతి విద్యార్థికి దిశానిర్దేశం చేసేలా కోర్సులు గురించి తెలిపామన్నారు. విద్యార్థులుకు ఎప్పుడు అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రిసోర్స్ అయిన హెల్ప లైన్ నంబర్, వెబ్‌సైట్ ఉపయోగించి కెరీర్‌పై మరింత అవగాహన పెంచుకోవడానికి ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఇండియా లిటరసీ ప్రాజెక్టు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి

కమాన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాల మహానాడు వ్యవస్థాపకుడు స్వర్గీయ పీవీరావుకు మాలమహానాడు మండలాధ్యక్షుడు మట్ట రాజయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి రామస్వామి హాజరై పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలల హక్కుల కోసం, దళిత జాతి ఐక్యత కోసం పీవీరావు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు పొనగంటి రాయనర్సు, మండల గౌరవ అధ్యక్షుడు భూపెల్లి మల్లేష్, సీనియర్ నాయకులు దాసరి రాంచందర్, కార్యవర్గ సభ్యులు మట్ట శంకర్, కునమల్ల రాయనర్సలు ఉన్నారు.

జిల్లా ఎడిటర్స్ కార్యవర్గం

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) పెద్దపల్లి జిల్లా ఎడిటర్స్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. బాలసాని వెంకటేష్, మల్లెబోయిన శ్రీనివాస్, ఎన్నికల అధికారులుగా వ్యవహరించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చేగొండ రవి కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కొల్లూరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎన్‌డీ తివారి, కోశాధికారిగా బొల్లం వేణు, ప్రచార కార్యదర్శిగా పల్లె శాంతిరాజ్, కార్యవర్గ సభ్యులుగా మల్లెబోయిన శ్రీనివాస్, బాలసాని వెంకటేశంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చేగొండ రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.